ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 17 మే 2024

మూడు రోజుల ఖర్చు



రూ.550 కోట్లు

టాప్‌లో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం

'ఈ ఐదేళ్లలో రెండు లక్షల 70 వేల కోట్ల రూపాయలు ప్రజల ఖాతాల్లో నేరుగా పంపిణీ చేశాం. ప్రభుత్వ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయి. రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలను ఏకపక్షంగా గెలవబోతున్నాం' అంటూ గొప్పలకుపోయిన అధికార వైసీపీ.. గెలుపుకోసం ఈ ఎన్నికల్లో వందల కోట్ల రూపాయలు కుమ్మరించింది. వారి ఖర్చుతో పోలిస్తే ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఆ దరిదాపుల్లో కూడా లేరు. ఈ లెక్కన నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు రూ.550 కోట్ల మేర ఖర్చు అయినట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఖర్చు ఈసారి జరిగిన అంచనాలను దాటింది. గతంతో పోలిస్తే అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఒక్కొక్కరికి డబుల్ అయ్యింది. అయినా ఎవరూ వెనుకాడ లేదు. గడిచిన ఎన్నికల్లో ఓటరుకు రూ.1,000 ఇవ్వడమే బాబోయ్ అన్నారు. ఈసారి రెండు నుంచి మూడు వేల వరకు ఖర్చు చేశారు. అయినప్పటికీ తాము ఆశించిన విధంగా పంపిణీ జరగలేదని ఇటు పార్టీ శ్రేణులు, ప్రజలు పెదవి విరిచారు. వీరు భావించిన మేరకు ఖర్చు చేసి వుంటే మరింత వ్యయం పెరిగేది. అయినప్పటికి మూడు రోజుల వ్యవధిలోనే అభ్యర్థులు జిల్లావ్యాప్తంగా రూ.550 కోట్లు పంపిణీ చేశారు. ఆ పైన ఎన్నికల ఖర్చులు మామూలే. వీటికి అదనంగా.. కేడర్ కోసం తాయిలాలు ఇచ్చారు. సంఘాలకు, కమ్యూనిటీ హాళ్లకు, విందులకు, వినోదాలకు భారీ మొత్తంలోనే వెచ్చించారు. జిల్లాలో అత్యధికంగా ఖర్చు చేయడంలో భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీపడ్డారు. ఆ తర్వాత తాడేపల్లిగూడెంలో సొమ్ములు వెదజల్లారు.

■ 2019లో రూ.240 కోట్లు

నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2019లో అయిన ఖర్చు రూ.240 కోట్లు. అప్పట్లో ప్రతి ఓటరుకు రూ.1,000 చొప్పున పంపిణీ చేశారు. 2014లో రూ.500 నుంచి రూ.750 వరకు తాయిలాలు ఇచ్చారు. పదేళ్లలో ఎన్నికల వ్యయం మూడింతలైంది. వ్యాపారాలు లేని అభ్యర్థులు రాజకీయంగా దెబ్బలు తింటున్నారు. ఆస్తులను తాకట్టు పెడుతున్నారు. అసెంబ్లీకి సంబంధించి ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షలు మాత్రమే వెచ్చించాలి. కానీ రూ.40 కోట్లకు పైగా ఖర్చు పెట్టాల్సిన దుస్థితి దాపురించింది. పార్టీలు అంగబలంతోపాటు, అర్థ బలం ఉన్న నాయకులనే అభ్యర్థులుగా ప్రకటిస్తున్నాయి.

అంచనాలకు మించి

భీమవరంలో ఒక్కో అభ్యర్థికి రూ.55 కోట్ల మేర ఖర్చు అయినట్లు లెక్కలు వేస్తున్నారు. ఈ లెక్కన ఇరు పార్టీలకు రూ.110 కోట్లు ఖర్చు తేలింది. ఆ తర్వాత ఉండిలో అభ్యర్థులు పోటీపడ్డారు. టీడీపీ, వైసీపీ, ఇండియన్ ఫ్వార్డర్ బ్లాక్ పార్టీలు పోటీ పడ్డాయి. ప్రధాన పార్టీ అభ్యర్థులు ఒక్కో ఓటుకు రూ.2 వేలు వెచ్చిస్తే.. ఫ్వార్డర్ బ్లాక్ అభ్యర్థి రూ.1000 వంతున ఇచ్చినట్టు చెబుతున్నారు. ఈ లెక్కన ముగ్గురు అభ్యర్థులకు దాదాపు రూ.110 కోట్లు ఖర్చయినట్టు అంచనాలు వేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో అభ్యర్థులు అంచనాలకు మించి వెచ్చించారు. వైసీపీ అభ్యర్థి ఒక్కో ఓటుకు రూ.2,500, కూటమి అభ్యర్థి రూ.1,500 పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఇరు పార్టీల అభ్యర్థులకు మూడు రోజుల్లో అయిన ఖర్చు రూ.75 కోట్లు. ఇందులో అధికార పార్టీ అభ్యర్థికి రూ.45 కోట్లు ఖర్చు అయితే కూటమి అభ్యర్థి వాటా రూ.28 కోట్లు. తణుకు నియోజకవర్గంలోనూ అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికల వ్యయంలో పైచేయిగా నిలిచారు. అక్కడ దాదాపు రూ.40 కోట్ల మేర ఖర్చు చేసినట్లు సమాచారం. కూటమి అభ్యర్థి ఒక్కో ఓటుకు రూ.1500తోపాటు, కూపన్లు ఇచ్చారు. అంటే గెలుపొందిన తర్వాత మళ్లీ నజరానాలు ఇవ్వాలన్న మాట. ఇలా తణుకులోనూ ఎన్నికల వ్యయం ఈసారి రెట్టింపయ్యింది. ఆచంటలోనూ ఇదే పరిస్థితి. అధికార పార్టీ అభ్యర్థి రూ.2000, కూటమి అభ్యర్థి రూ.1000 వరకు ఇచ్చినట్లు చెబుతున్నారు. అధికార పార్టీ నుంచి పూర్తిగా సొమ్ములు అందిస్తే.. కూటమి అభ్యర్థి సొమ్ములతోపాటు, కూపన్‌లు ఇచ్చారు. ఎన్నికల తర్వాత మళ్లీ పంపిణీలు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ అధికార పార్టీ అభ్యర్థి రూ.50 కోట్లు, కూటమి అభ్యర్థికి రూ.20 కోట్ల వరకు ఖర్చు అయినట్లు సమాచారం. పాలకొల్లు, నర్సాపురం నియోజకవర్గాల్లోనే కాస్త తక్కువ వ్యయంతో అభ్యర్థులు గట్టెక్కారు. పాలకొల్లులో ప్రధాన పార్టీ అభ్యర్థులు దాదాపు రూ.60 కోట్ల మేర వెచ్చిస్తే, నర్సాపురంలో రూ.45 కోట్ల వరకు ఖర్చు చేశారు.

డబ్బుతోనే గెలిచేస్తారా ?

సంక్షేమ పథకాలు తమను గట్టెక్కిస్తాయని గట్టి నమ్మకంతో వున్న వైసీసీ నాయకులు ఎన్నికల నాటికి డబ్బుపైనే ఆశలు పెట్టుకున్నారు. అదేస్థాయిలో ఖర్చు పెట్టారు. ఎన్నికల వ్యయం కోసం జిల్లాలో కొందరు అభ్యర్థులు ఆస్తులు తాకట్టు పెడితే, మరికొందరు ఉన్న ఆస్తులను అమ్ముకున్నారు. అప్పులు చేశారు. కూటమిలోనే ఈ పరిస్థితి నెలకొంది. అధికార పార్టీలో అయితే గడచిన ఐదేళ్లలో సంపాదించిన సొమ్మును అభ్యర్థులు కొందరు విచ్చల విడిగా ఖర్చుపెట్టారు. ఎన్నికల్లో ప్రతీసారి డబ్బులు పంపిణీ చేయడం ఆనవాయితీ అయిపోతోంది. ఎంత సొమ్ము ఇచ్చినా సరే విజయం మాత్రం మరోలా ఉంటోంది. జనం ఏమనుకుంటే అటు వైపే గెలుపు లభిస్తోంది. అంతేతప్ప అధికంగా సొమ్ములు ఇచ్చినంత మాత్రాన విజయం వరించడం లేదు. జిల్లాలో నాడి ఒకే మాదిరిగా ఉంటోంది. అత్యధికంగా డబ్బులు ఇచ్చిన అభ్యర్థులు బూతుల వారీగా ఇప్పుడు లెక్కలు వేసుకుంటున్నారు. తమదే గెలుపు అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

ఇంటికి పది వేలు



ప్రతి నియోజకవర్గంలోనూ ఒక్కో ఇంటికి ఎలా లేదన్నా రూ.10 వేలు వంతున చేరాయి. అన్ని పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు ముట్టజెప్పారు. ఇప్పుడా సొమ్మంతా మార్కెట్‌కు తరలివస్తోంది. హోటళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు రద్దీగా ఉంటున్నాయి. ఎలక్ట్రానిక్ వస్తు దుకాణాల్లోనూ సేల్ పెరిగింది. మద్యం అమ్మకాలు పెరిగాయి. అంతలా సొమ్ములు జనాలకు వద్దకు చేరాయి. ప్రచారాల్లో అభ్యర్థులు ఖర్చులు తగ్గించారు. షెడ్యూల్ ప్రకటన నుంచి ఎన్నికల వరకు ఎక్కువ రోజులు వ్యవధి ఉండడంతో అభ్యర్థులు పొదుపు పాటించారు. కార్యకర్తలతోనే ప్రచారాలు నిర్వహించేందుకు ఆసక్తి చూపారు. పెయిడ్ వర్కర్లు తక్కువగా ఉన్నారు. కూటమి నుంచి మాత్రం అంతా స్వచ్ఛందంగానే ప్రచారాలు సాగడంతో కొంత వ్యయం తగ్గింది. అదే అధికార పార్టీ అయితే కార్యకర్తలకు, నాయకులకు స్థాయిని బట్టి ప్యాకేజీలు ఇచ్చారు.

వైసీపీలో.. అంతర్మథనం

ఏం జరుగుతోంది ?

- వలంటీర్లను నమ్మి నట్టేట మునిగామా..
- ఎన్నికల రోజు పనిచేయలేదంటూ కేడర్‌పై అభ్యర్థుల కస్సుబుస్సు

■ వలంటీర్లంతా మా కార్యకర్తలు.
- ఎన్నికల ముందు సిద్ధం సభలో జగన్ చేసిన వ్యాఖ్యలివి.

■ వలంటీర్లే లేకపోతే ఈ సారి ఎన్నికలే లేవు..
- జిల్లాలోని ఓ అధికార పార్టీ అభ్యర్థి అంతరంగమిది.



ఆ నమ్మకమే ఇప్పుడు కొంపముంచిందా ? వలంటీర్లు ఉన్నారంటూ కేడర్‌ను పట్టించుకోక పోవడంలో తప్పిదం జరిగిందా ? వైసీపీలో ఇటువంటి అంశాలపైనే జోరుగా చర్చసాగుతోంది. మరోవైపు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సక్సెస్ అయ్యిందా..? ఎన్నికల్లో ఓటమి తప్పదా ? అంటూ అభ్యర్థులు మథనపడుతున్నారు. వైసీపీలో ఇప్పుడు అంతర్మథనం, ఆత్మ పరిశీలన ప్రారంభమైంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మీరంతా ఎన్నికల్లో ఎక్కడా కనిపించలేదు. ఓటర్ల వద్దా లేరు. పోలింగ్ బూతులకు ఎందుకు దూరంగా ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస స్పందనలేదేమిటి ? అంటూ తాడేపల్లిగూడెంలో అధికార పార్టీ నేత తమ సొంత శ్రేణుల పై కస్సుబుస్సులాడుతున్నారు. కోట్లు ఖర్చుపెట్టాం. అనుకున్న ఫలితాలు ఎందుకు రావడం లేదంటూ కేడర్‌పై తప్పు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి తణుకులోనూ నెలకొంది. భీమవరం, ఆచంట నియోజకవర్గాల్లో మాత్రం మరో విధమైన విశ్లేషణలు జోరందుకున్నాయి. ఐదేళ్ల కేడర్‌ను పట్టించుకోలేదు. పార్టీకి, కేడర్‌కు సంబంధం తెగిపోయింది. జిల్లాలోని ఏడు నియోకజవర్గాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ కోటరీ ఏర్పడింది. వారిని అధిగమించి కేడర్ తమ నాయకులను కలవలేకపోయారు. ప్రజలు కూడా అధికార పార్టీ నేతలకు దూరమయ్యారు. వలంటీర్లపైనే ప్రభుత్వం ఆధారపడింది. ఓటర్ల వివరాలు సేకరించాలన్నా వారే. సంక్షేమ పథకాలకు అర్హులను నిర్ధారించాలన్నా వారే. ఇప్పుడదే తమ కొంపముంచిందా అంటూ అధికార పార్టీలో నేతలు మదనపడుతున్నారు. పైకి మాత్రం తమదే గెలుపంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

చేతులెత్తేసిన కేడర్

ఎన్నికల రోజు మధ్యాహ్నానికే వైసీపీ కేడర్ చేతులెత్తేసింది. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పది మందిలోపే కార్యకర్తలు పనిచేశారు. వారంతా పోలింగ్‌కేంద్రాలకు దూరంగా ఉన్నారు. మధ్యాహ్నానికి వారి జాడే లేదు. అభ్యర్థులే ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తూ వచ్చారు. సొమ్ములు అందుకున్న నాయకులైతే పోలింగ్ బూత్‌ల్లో అత్యధిక సమయం గడిపారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద కూటమి కార్యకర్తలు స్వచ్ఛందంగా పనిచేశారు. వీరి హడావుడి కనిపించింది. ఐదేళ్లపాటు కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే ఎన్నికల్లో కేడర్ కలిసి రాలేదంటూ అధికార పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

కలిసిరాని వలంటీర్లు

ప్రతి నియోజకవర్గంలోనూ వైసీపీ అభ్యర్థులు వలంటీర్లపైనే ఆధారపడ్డారు. ఒత్తిడి చేసి వలంటీర్లతో రాజీనామాలు చేయించారు. ఆచంట, భీమవరం, ఉండిల్లో వీరు ఎక్కువగా వున్నారు. వీరితోనే ఎన్నికల ప్రచారం చేశారు. అభ్యర్థుల నామినేషన్ల నుంచి ప్రచారం వరకు అంతా వారి వెంటే వున్నారు. అయితే ఎన్నికల్లో వీరి మాట ఎవరూ లెక్క చేయలేదు. ఇదే ఇప్పుడు తమ కొంపముంచిందంటూ వైసీపీ నేతలు మథనపడుతున్నారు. అది కూడా జిల్లాలో 4,200 మంది వలంటీర్లు మాత్రమే రాజీనామా చేశారు. అందులోనూ కొందరు ప్రచారాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల్లో వలంటీర్లపై ఆధారపడిన నేతలు కేడర్‌ను విస్మరించింది. కార్యకర్తలైతే ఓటరును తీసుకువెళ్లి ఓటు వేయించే వరకు కీలకంగా ఉంటారు. వలంటీర్ల వల్ల అది సాధ్యపడలేదు. ఇది కూడా పార్టీకి పెద్ద మైనస్ అయ్యిందంటూ పార్టీ శ్రేణులు విశ్లేషిస్తున్నాయి. కూటమిలో మాత్రం మూడు పార్టీల నాయకులు ప్రతి గడపతొక్కారు. సొంత ఎన్నికల్లా కార్యకర్తలు పనిచేశారు. వైసీపీ ఇందుకు భిన్నంగా సంక్షేమ పథకాలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను నమ్ముకుంది. బోర్లా పడిందంటూ పార్టీలో చర్చ నడుస్తోంది.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం టౌన్, మే 16 : వచ్చే నెల నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత ఆర్వోలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటుచేశాం. మొదట కేంద్ర సాయుధ బలగాలు(ఐటీబీపీ), రెండులో ఆర్మడ్ రిజర్వు బలగాలు, మూడో అంచెలో స్థానిక సివిల్ పోలీసులను రక్షణగా ఏర్పాటుచేశాం. పోటీలోవున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లకు నిర్ణయించిన పరిధి వరకు మాత్రమే అనుమతిస్తాం. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను అనుమతించం. స్ట్రాంగ్ రూముల వద్ద నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పోలింగ్ యంత్రాలు తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి మార్గాలన్నీ ప్రణాళికబద్ధంగా బారీ కేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలి. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయి' అని హెచ్చరించారు.

నియోజకవర్గాలు.. భీమవరంలోని కౌంటింగ్ సెంటర్లు

- ఆచంట : విష్ణు కాలేజీ.. బి.సీత పాలిటెక్నిక్ కాలేజ్ రెండో అంతస్తు.
- పాలకొల్లు : బి.సీత పాలిటెక్నిక్ కాలేజ్ సెకండ్ ఫ్లోర్ డ్రాయింగ్ హాల్ నెం.1.
- నరసాపురం : శ్రీ విష్ణు ఫుడ్ ప్లాజా-1 డైనింగ్ హాల్
- తణుకు : శ్రీ విష్ణు స్కూల్ గ్రౌండ్ ఫ్లోర్.
- భీమవరం : ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యు బ్లాక్ రెండో అంతస్తు.
- ఉండి : ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్.
- తాడేపల్లిగూడెం : ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాల యు బ్లాక్ మూడో అంతస్తు.

ఏపీఈఏపీ సెట్ మొదటి రోజు ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్/తాడేపల్లిగూడెం రూరల్, మే 16 : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2024 పరీక్ష మొదటి రోజు గురువారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 200 మంది విద్యార్థులకు 175, ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 350 మందికి 313, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రంలో 198 మందికి 174, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో 300 మందికి 277, పెదతాడేపల్లి శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 439 మందికి 405, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో 259 మందికి 242 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు కో ఆర్డినేటర్లు తెలిపారు.



తాడేపల్లిగూడెం, భీమవరంలలో

వాన కురిసింది

- చల్లబడిన వాతావరణం.. సేద తీరిన జనం
- పూర్తికాని మాసూళ్లు.. పంట రక్షించుకునే పనిలో రైతులు

ఆచంట/ఉండి/పాలకొల్లు అర్బన్/మొగల్తూరు, మే 16 : వాతావరణంలో మార్పుల కారణంగా ఏ నిమిషం ఏం జరుగుతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న మూడు రోజులపాటు తేలికపాటి వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ముందుజాగ్రత్తగా చేతి కందించి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలోపడ్డారు. గురువారం వేకువజాము నుంచి జిల్లాలో చిరుజల్లులు పడటంతో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రాశులుగా పోసి, గడ్డి కప్పి గాలికి ఎగరకుండా బరకాలతో కట్టారు. మొగల్తూరు మండలం 1,192 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టగా 250 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. మిగిలిన రైతులు వాతావరణంలో మార్పుల కారణంగా ఆలస్యంగా నాట్లు వేసుకోవడంతో దిగుబడి రావడం ఆలస్యమైంది. దీంతో ముందుగా ఊడ్చిన రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోగా ఆలస్యంగా ఊడ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం గ్రామాల్లోని రైతులు కోసిన ధాన్యాన్ని తేమ శాతం లేకుండా రహదారులపైన, చేలల్లోని కల్లాల్లోను ఆరబెడున్నారు. అయితే వాతావరణ మార్పులతో వీటిని కుప్పలుగా పోసి బరకాలు, గడ్డి కప్పి గాలి, వానలకు తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆచంట మండలంలో 90 శాతానికి పైగా దాళ్వా మాసూళ్ళు పూర్తయ్యాయి. కొన్ని రోజులుగా ఎండలు ఎక్కువగా ఉండటంతో మాసూళ్ళు వేగంగా జరుగుతున్నాయి. ఈ తరుణంలో గురువారం వాతావరణం ఒక్కసారిగా మబ్బులు, మేఘాలు పట్టి వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందారు. అనేకచోట్ల ధాన్యం రాశులు, బస్తాలు రోడ్ల మీదే ఉండటంతో తడిచిపోకుండా రైతులు బరకాలతో కప్పుకున్నారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం పొడిగా ఉండటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వేమవరం, వల్లూరు, పెనుమంచిలి, పెదమల్లం వంటి గ్రామాల్లో మాసూళ్ళు కావాల్సి ఉంది. అయితే వాతావరణం వారిని భయపెడుతోంది.



మొగల్తూరులో ధాన్యం రాశులకు కట్టిన బరకాలు



ఆచంటలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

పాలకొల్లులో ఉదయం నుంచి చిరుజల్లులు కురవడంతో వాతావరణం కొంత చల్లగా మారింది. రోజంతా ఆకాశంలో మబ్బులు కమ్మి ఉండటంతో ఆహ్లాదకరంగా ఉంది. ఎండ వేడిమిని చూసి భయపడుతున్న ప్రజలు చల్లని వాతావరణంతో సేద తీరుతున్నారు. ఉండి మండలం యండగండి, ఉణుదుర్రు, ఉప్పులూరు, వెలివర్రులో కుండపోత వర్షం కురిసింది. అప్పుడు వరకు మండుటెండతో ఉక్కపోతతో ఇబ్బంది పడిపోయిన ప్రజలు రైతులు ఒక్కసారిగా మేఘం కమ్మడంతో ఊపిరి పీల్చుకున్నారు. కుండపోత వర్షంతో రోడ్లపై వర్షం నీరు చేరి అధ్వాన్నంగా మారింది. రోడ్లకు ఇరు వైపులా డ్రైయినేజీలు లేకపోవడంతో వర్షం నీరు రహదారులపై నిలిచిపోయింది. ఆర్‌అండ్‌బీ రోడ్లపైనవున్న గోతుల్లో నీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

దిగుబడి లేని మామిడి

ఈ ఏడాది మామిడి రైతులు దిగుబడి లేక ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంతో దాని ప్రభావం ఈ ఏడాది మామిడి ఫలసాయంపైన పడింది.

డయేరియా విజృంభణ

రెండు గ్రామాల్లో 13 మందికి అస్వస్థత.. ఇద్దరి మృతి



కుక్కునూరు, మే 16 : ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఆదివాసీ గ్రామాలైన కురుములతోగు, కొసాయిగుంపుల్లో డయేరియా ప్రబలింది. దామరచర్ల పంచాయతీ కురుములతోగులో పది మంది, మాధవరం పంచాయతీ కొసాయిగుంపులో ముగ్గురు డయేరియా బారినపడ్డారు. రెండు రోజుల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. బుధవారం కురుములతోగుకు చెందిన మడకం బొజ్జమ్మ(65), గురువారం ఇదే గ్రామానికి చెందిన మడకం దేవరాజు(8) వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మృతిచెందారు. ఈ రెండు గ్రామాల్లో కనీసం చేతిపంపులు లేకపోవడంతో ఆదివాసీలు సమీపంలోని వాగు గుంతల్లో ఉన్న నీటిని తాగు నీరుగా వాడుతున్నారు. నాలుగు రోజుల క్రితం వర్షం కురవడంతో వాగు గుంతల్లోని నీరు కలుషితమైంది. అయినప్పటికీ ఆ నీటినే తాగు నీరుగా ఉపయోగించడంతో గ్రామస్థులు అనారోగ్యానికి గురయ్యారు. కడుపునొప్పి ప్రారంభమై వాంతులు, విరేచనాలకు గురవుతున్నారు. వైద్య సిబ్బంది అస్వస్థతకు గురైన వారిని అమరవరం, భద్రాచలం ప్రభుత్వాస్పత్రులకు తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. గురువారం ఐటీడీఏ పీవో సూర్యతేజ ఆ గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని, మూడు రోజులపాటు ఆహారం అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఇంకెప్పుడిస్తారు ?

నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో పడని ఆసరా.. విద్యా దీవెన.. ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ములు

ఎదురుచూస్తున్న మహిళలు, రైతులు

భీమవరం రూరల్, మే 16 : అదిగో.. ఇదిగో.. ఎన్నాళ్ళాలా.. బటన్ నొక్కేటప్పుడు పథకాల సొమ్ములు చేతిలో పెట్టినంత హడావిడి.. మరి. నెలలు దాటిపోతున్నా లబ్ధిదారులకు సొమ్ములందలేదు. ఈఏడాది ఆరంభంలో బటన్‌ల నొక్కుడు మొదలు. నెలకు ఇరవై రోజులకు ఒకటి నొక్కుతూ వచ్చారు. కాని, సొమ్ములు వేయడంలో తుస్మనిపించారు. పోలింగ్ జరిగే రెండు రోజులు ముందు సొమ్ములేస్తామని ప్రచారం కాస్తా ఎన్నికల నిబంధనలకు అడ్డుపడేలా చేసింది. ఎన్నికలు ముగిసి నాలుగు రోజులైనా పథకాల సొమ్ములు ఊసేలేదు. అప్పటి హడావుడి ఎన్నికల కోసమా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యాదీవెన సొమ్ములు ఇంకా పడలేదు. జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఇంకా రూ.22 కోట్లు పడాలి. వేల మంది విద్యార్థులు నెలలు తరబడి సొమ్ములు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. గత ఏడాది సార్వాలో మీచౌంగ్ తుఫాన్ దాటికి నష్టపోయిన పంట నష్టం ఇన్‌పుట్ సబ్సిడి కింద రావాల్సిన సొమ్ములు ఆరు నెలలుగా రైతులు ఎదురుచూస్తూనే వున్నారు. జిల్లాలో 50 వేల హెక్టార్లలో పంట నష్టం ఏర్పడగా 31,908 మంది రైతులకు రూ.26 కోట్లు నష్టపరిహారం కింద ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు చెల్లించాల్సి ఉంది.



సార్వా వెళ్లి దాళ్వా కూడా ముగిసింది. మరో 20 రోజులైతే మరో సార్వా పనులు మొదలవుతాయి. ఇక ఆసరా సొమ్ముల కోసం మహిళలు రోజూ వారి ఖాతాలు పరిశీలించుకోవడమే తప్ప సొమ్ములు జమ అయితే ఒట్టు. గత ఏడాది చివరిలో వేయాల్సిన సొమ్ములు ఎన్నికల ముందు వేసి ఆకర్షణగా అస్త్రంగా ఉపయోగించాలనుకున్నారు. పెద్ద ఆర్భాటంగా జనవరిలో నొక్కిన బటన్ ఇప్పటికి సొమ్ములు పడలేదు. అరకొర ఎస్సీ, ఎస్టీ గ్రూపులకు మాత్రమే సొమ్ములు పడినట్లు సమాచారం. జిల్లాలో 27 వేల 4 గ్రూపులు గాను రూ.275 కోట్లు మహిళల ఖాతాల్లో పడాలి. ఎన్నికలయ్యాయి. అప్పుడే వెయ్యలేదు ఇప్పుడు వేస్తారా అనే విమర్శలు మాత్రం పథకాలపై రోజురోజుకు పెరిగిపోతున్నాయి.



గుత్తేదారు నుంచి రాతపూర్వక పత్రం తీసుకుంటున్న అధికారులు

పూజలు సక్రమంగా జరిగేలా చూస్తాం

బాల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులతో సమావేశమైన అధికారులు

పెంటపాడు, మే 16 : పెంటపాడు బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత నాలుగు నెలలుగా స్వామివారికి దీప,దూప నైవేద్యాలు సక్రమంగా జరగడం లేదంటూ భక్తులు కొంతమంది బుధవారం ఆలయం వద్ద నిరసన చేపట్టడంపై అధికారులు స్పందించారు. గురువారం ఆలయం వద్ద తాడేపల్లిగూడెం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజనకుమార్, ఆలయ ఈవో చీమలకొండ సాయిలు భక్తులతో సమావేశమయ్యారు. స్వామివారికి సంప్రోక్షణ పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. స్వామివారి 9.40 ఎకరాలకు సంబంధించి ఇప్పటివరకు గుత్తేదారులుగా ఉంటున్న విజయలక్ష్మి తన వద్ద ఉన్న పొలాన్ని అధికారులకు ఇచ్చేస్తున్నట్లు రాత పూర్వకంగా తెలిపారు. ఈవో చీమలకొండ సాయి మాట్లాడుతూ ఇద్దరు అర్చకులను ఏర్పాటు చేసి స్వామివారి దీపదూప నైవేద్యాలు ప్రతీరోజు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. అలాగే మిగిలిన నలుగురు గుత్తేదారుల వద్ద ఆలయానికి చెందిన 9.40 ఎకరాల పొలం ఉందని వారితో కూడా మాట్లాడతామన్నారు.

ఇసుక తవ్వకాలపై సెబ్ అధికారుల తనిఖీ



నివేదిక రాస్తున్న సెబ్ సిబ్బంది, సీఐ శ్రీనివాసరావు

మొగల్తూరు, మే 16: మండలంలోని శేరేపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై నరసాపురం సెబ్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు.శేరేపాలెం పంచాయతీ 6వ వార్డు సభ్యుడు కత్తుల శ్రీనివాస్ ఆన్‌లైన్‌లో స్పందనలో ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో అనుమతి లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల రహదారులు ఛిద్రంగా మారుతున్నాయని ఇసుక ట్రాక్టర్ల సంచారంతో గ్రామంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో గురువారం నరసాపురం ఎస్‌ఈబీ సీఐ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బందితో గ్రామంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ విషయం ముందుగా తెలియడంతో ట్రాక్టర్‌లు, లారీల ఎగుమతులను ఇసుక మాఫియా ఆపివేసిందని అధికారులు వెళ్ళిన వెంటనే తిరిగి ఇసుక తవ్వకాలు, ఎగుమతులు యధావిధిగా జరిగాయని ఫిర్యాదు దారుడు కత్తుల శ్రీనివాస్ పేర్కొన్నారు.



కొంతేరు యూత్‌క్లబ్ నాటక పరిషత్ నాటిక పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పరిషత్ కార్యవర్గ సభ్యులు

నేటి నుంచి కొంతేరు యూత్ క్లబ్ నాటక పరిషత్ నాటిక పోటీలు

యలమంచిలి, మే 16: మండలంలోని కొంతేరు గ్రామంలో యూత్‌క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో 42వ అఖిల భారతస్థాయి నాటిక పోటీలను ఈనెల 17, 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి మురళీకృష్ణ, గంటా ముత్యాలరావు తెలిపారు. కొంతేరు యూత్‌క్లబ్ నాటక పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు నాటిక పోటీల బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం పరిషత్ అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ నాటిక పోటీలను 42 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 17వ తేదీన శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'కౌసల్యా.. సుప్రజా.. రామా..',సుకృతి క్రియేషన్స్ చిలకలూరిపేట వారి 'మిణుగురు ..వెలుగులు', 18వ తేదీన శ్రీక్రాంతి ఆర్ట్ థియేటర్స్ నెల్లూరు వారి 'ఓ మనిషి కావాలి', శ్రీషిర్డిసాయి కల్చరల్ క్రియేషన్స్ అనకాపల్లి వారి 'మలిసంధ్య', ఆరాధనా ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి 'క్షేత్రం', 19వ తేదీన శ్రీయువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి 'బూడిద', శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ గుడివాడ వారి 'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటికలను ప్రదర్శిస్తారని వివరించారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

విజిలెన్సు తనిఖీల్లో బియ్యం పట్టివేత

భీమడోలు, మే 16 : భీమడోలు మండలం గుండుగొలనులోని ఒక రేషన్ షాపులో లెక్కకు మించి రేషన్ సరుకులు ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిర్వహించారు. లెక్కకు మించి దుకాణంలో 122 కేజీల బియ్యం, ఏడు ప్యాకెట్ల పంచదార, 17 ప్యాకెట్లు గోదుమపిండి ఉన్నట్లు గుర్తించారు. రేషన్ దుకాణ యజమాని నీలంశెట్టి శివకుమార్‌పై 6-ఎగా కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మాధవరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నరసాపురం రూరల్, మే 16: మండలంలోని వేములదీవి సర్దుగొడప గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌తో గేదే అక్కడిక్కడే మృతి చెందింది. ఒడుగు సత్యానారాయణకు చెందిన గేదె గడ్డి మేస్తూ కరెంట్ పోల్ వద్దకు చేరింది. అక్కడ ఎర్త్ వైర్ లేకపోవడంతో ఒక్కసారిగా కరెంట్ కొట్టడంతో గేదె కుప్పకూలినట్లు బాధితుడు సత్యనారాయణ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు.

ఆగని దోపిడీ

బస్సులు, రైళ్ల రద్దీ



తాడేపల్లిగూడెం రూరల్, మే 16: సార్వత్రిక ఎన్నికల పరిస్థితి ఎలా ఉన్నా ఆ పేరు చెప్పి ట్రావెల్స్ బస్సుల దోపిడీ మాత్రం భరించలేకుండా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి రైళ్ల రిజర్వేషన్ ఖాళీ లేకుండా పోవడంతో హైద్రాబాద్ నుంచి భారీగా ఓటర్లు తరలి వస్తున్నారని ట్రావెల్స్ బుకింగ్స్ నిలుపుదల చేశారు. దీనికి తోడు వచ్చేవరకూ ఒక రేటు తిరుగు ప్రయాణంలో మరో రేటు ఇష్టమొచ్చిన రీతిలో దోపిడీ చేశారు. సాధారణంగా హైద్రాబాద్‌కు తాడేపల్లిగూడెం నుంచి రూ.600 నుంచి 900 బస్సు వసతులను బట్టి టిక్కెట్ ధర ఉంది. ప్రస్తుతం రద్దీని సాకుగా చూపి ట్రావెల్స్ సాధారణ టికెట్టు ధర రూ.1500 నుంచి రూ.2500 వరకూ దోచేస్తున్నారు. రైళ్లలో వెళదామంటే రద్దీ మామూలుగా లేదు. పికప్ ట్రావెల్స్ అంటే ఇటు నుంచి అటు అటు నుంచి ఇటు వెళ్లే కార్ల ధర రూ.10 వేల పైమాటే. దీంతో ప్రయాణికులు ఆ ధర భరించి ప్రయాణించలేక అక్కడ పనులు మాని ఇక్కడ ఉండలేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

దెందులూరు..బిక్కు బిక్కు

ప్రశాంతమైన నియోజకవర్గంలో కక్షలు..కొట్లాటలు

ఐదేళ్లుగా ఎక్కడో చోట వివాదాలు

భయపడిపోతున్న ప్రజలు



ముండూరులో వివాదాన్ని సరిచేస్తున్న పోలీసులు(ఫైల్)

పెదవేగి, మే 16 : ప్రశాంతమైన దెందులూరు నియోజకవర్గంలో ప్రశాం తతకు భంగం కలుగుతోంది. కక్షలు, కార్పణ్యాలు పెరుగుతున్నాయి. దెందు లూరు నియోజకవర్గం ఏర్పడినాటినుంచి ఇప్పటికి 15 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఎప్పుడూ కూడా దాడులు, దౌర్జన్యాలు జరిగిన దాఖ లాలు లేవు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ళ నుంచి నియోజకవర్గంలో ఏదో ఒకచోట ఘర్షణలు,కొట్లాటలు జరగడమనేది నిత్యకృత్యంగా మారాయి. మట్టి మాఫియాను అడ్డుకున్నారనే ఆగ్రహంతో ఐదునెలల కిందట టీడీపీ నాయకులు డాక్టర్ పసుమర్తి మధు, తాతా సత్యనారాయ ణలపై దాడిచేసి, విచక్షణారహితంగా కొట్టారు. వాహనాలను ధ్వంసం చేశారు. వీటికి ఫుల్‌స్టాప్ ఎప్పుడు పడుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో విష సంస్కృతికి తెరతీశారు. వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. నియోజకవర్గంలో 239 పోలింగ్ స్టేషన్లు ఉండగా చాలాచోట్ల అల్లరిమూకలు ఘర్షణలకు దిగారు. పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండడంతో వివాదాలను కొంత వరకు అదుపుచేశారు. నియోజకవర్గంలో సోమవరప్పాడు, కొవ్వలి, పెదవేగి, జగన్నాదపురం.. ఇలా కొన్ని గ్రామాల్లో దాడులకు పాల్పడ్డారు. టీడీపీకి ఓటు వేస్తారనే అనుమానంతో నలుగురు వ్యక్తులపై వైసీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు గాయాల పాలయ్యారు. కొవ్వలిలో వైసీపీ కవ్వింపులను అడ్డుకోవడంతో చెలరేగిన వివాదాన్ని ఆపడానికి వెళ్ళిన గ్రామ ఉపసర్పంచ్ గోరిపర్తి శివకొండలరావుపై విచక్షణా రహితంగా దాడిచేశారు. జగన్నాదపురంలో టీడీపీ అనుకూలంగా ఉన్నాడనే అక్కసుతో దాడిచేసి, దుస్తులు చించి, గాయపర్చారు. పెదవేగిలో పసుపు రంగు చొక్కా వేసుకు తిరుగుతున్నారని, టీడీపీ వర్గీయులపై దాడికి పాల్పడ్డారు. సకాలంలో పోలీసులు రావడంతో గొడవ అక్కడితో సద్దుమణిగింది. ముండూరులో కవ్వింపు చర్యలకు దిగిన వైసీపీ వర్గీయులను పోలీసులు అదుపు చేశారు. కొప్పులవారిగూడెంలో కవ్వింపు చర్యలకు దిగి, గొడవకు కారకుడైన గ్రామ సర్పంచ్ కుమారుడు చలపాటి రవిని, టీడీపీ వర్గీయుడు తాళ్ళూరి రాజశేఖర్ అడ్డుకున్న సమయంలో వైద్య శిబిరంలో కత్తెర తగిలి రవి గాయపడ్డాడు. గొడవకు కారణాలను మాత్రం పట్టించుకోకుండా రాజశేఖర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఏదో సాకుతో గొడవలు సృష్టించడానికి వైసీపీ కవ్వింపు చర్యలకు దిగినా టీడీపీ వర్గీయులు ఒకింత సంయమనం పాటించడంతో ఆయాచోట్ల పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

నోటీస్ ఇస్తామని పిలిచి.. హత్యాయత్నం కేసు

పోలీసుల తీరుపై చింతమనేని ఆగ్రహం..

నిందితుడిని వెంట తీసుకెళ్లడంతో కేసు నమోదు

ఎన్నికల రోజు జరిగిన ఘటనలో కేసు నమోదు చేశామని, 41 నోటీసు తీసుకోవడానికి రమ్మని చెప్పిన పోలీసులు.. తీరా స్టేషన్‌కు వెళ్లాక హత్యాయత్నం కేసు నమోదైందని అరెస్టు చేస్తామని చెప్పడంతో ఈ విషయాన్ని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాడు. చింతమనేని స్టేషన్‌కు చేరుకుని పోలీసుల తీరును ఖండిస్తూ తన వెంట ఆ వక్తిని తీసుకెళ్లడంతో పోలీసులు చింతమనేనిపై కేసు నమోదు చేశారు. పెదవేగి మండలం కొప్పులవారి గూడెంలో ఎన్నికల రోజు సోమవారం వైసీపీకి చెందిన చలపాటి రవికి టీడీపీకి చెందిన తాళ్ళూరి రాజశేఖర్‌కి ఘర్షణ జరిగింది. ఆ సమయంలో రవి మెడపై కత్తెరగాటు పడింది. దీనిపై పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో రాజ శేఖర్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో 41 నోటీస్ ఇస్తాం.. స్టేషన్‌కు రావాలని స్టేషన్ నుంచి ఫోన్ రావడంతో రాజశేఖర్ గురువారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాడు. అక్కడికి వెళ్లిన తర్వాత నీపై హత్యాయత్నం కేసు నమోదు చేశాం..అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు చెప్పారు. ఫోన్‌లో ఈ విషయం చింతమనేనికి చెప్పడంతో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చింతమనేని.. 41 నోటీస్ ఇస్తామని చెప్పి అరెస్టు చేస్తామని చెప్తున్నారేమిటని పోలీసులను ప్రశ్నిం చారు. బాధితుడిపై హత్యాయత్నానికి పాల్పడినందున అతనిని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు చెప్పారు. దీనిపై ఆగ్రహించిన చింతమనేని మాట్లాడుతూ ఎన్నికలరోజు వైసీపీ శ్రేణులు, టీడీపీ శ్రేణులపై కర్రలు, కత్తులతో దాడులు చేసి, దారుణంగా గాయపర్చినా, హత్య చేయాలని ప్రయత్నించినా చర్యలు తీసుకోని పోలీసులు ఇప్పుడు వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం అందరికీ ఒకేలా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. వైసీపీ నాయకుల మెప్పుకోసం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని ప్రభాకర్ పేర్కొంటూ తనతో పాటు రాజశేఖర్‌ను తీసుకెళ్లిపోయారు.



పెదవేగి పోలీసు స్టేషన్‌కు వచ్చిన చింతమనేని

చింతమనేనిపై కేసు నమోదు

పోలీస్ విధులను ఆటంకపర్చి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిగా ఉన్న తాళ్ళూరి రాజశేఖర్‌ను తీసుకెళ్ళిన ప్రభాకర్‌పై కేసు నమోదు చేశామని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య తెలిపారు. గురువారం సాయంత్రం పెదవేగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన మధ్యాహ్నం జరిగిన ఘటన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న నిందితుడిని సీఐ, ఎస్‌ఐ అడ్డుపడినా వదలకుండా బలవంతంగా తీసుకెళ్ళడం నేరమని, దీనిపై ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం

చిన్న తిరుమలేశుని క్షేత్రంలో ఏర్పాట్లు

రేపటి నుంచి శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాలు



ద్వారకాతిరుమల, మే 16: శేషాచలంపై స్వయంవ్యక్తునిగా కొలువుదీరిన చిన్నతిరుమలేశునికి ఏడు కొండలపై జరిగే వేడుక.. భక్తజనకోటి కనులారా వీక్షించి తరించే సంబరం...వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు. ఈ ఉత్సవాలు శ్రీవారి క్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల క్షేత్రాన్ని నిత్యం వేలాదిమంది భక్తులు స్వామిని దర్శిస్తుంటారు. వైఖానస ఆగమాన్ని అనుసరించి పాంచాహ్నిక దీక్షతో ప్రతి ఏటా రెండుసార్లు బ్రహ్మోత్సవాలను జరపడం ఇక్కడ సంప్రదాయబద్ధమైంది. ఈనెల 18 నుంచి 25 వరకూ జరగనున్న వైశాఖ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి, అమ్మ వార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు.19న ధ్వజారోహణ, 21న సాయంత్రం 5గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 22న రాత్రి 8-30 గంటలకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు. 23న రాత్రి 7 గంటలకు రథోత్సవం ఉంటాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 18 నుంచి 25 వరకూ శ్రీవారికి జరిగే నిత్యార్జిత కల్యాణాలు, సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. 26 నుంచి అన్నిసేవలు యధావిధిగా పునరుద్ధరిస్తామని భక్తులు గమనించాలని కోరారు.

వాహన సేవలిలా ..

బ్రహ్మోత్సవ సమయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యం జరిగే వాహన సేవల నిమిత్తం వాహనశాల నుంచి వివిధ రకాల వాహనాలను బయటకు తెచ్చి సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. రోజుకో వాహనంలో అమ్మవార్లతో కలసి శ్రీవారు వివిధ అలంకారాల్లో అట్టహాసంగా ఊరేగుతారు. 18న రాత్రి 7 గంటలకు గజవాహనంపై , 19న రాత్రి 9 గంటలకు హంసవాహనంపై, 20న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహ నాలపై తిరువీధిసేవలు ఉంటాయి. 21న ఉదయం 7 గంటలకు హనుమంత వాహనంపై, రాత్రి 8-30 గంటలకు వెండి శేషవాహనాలపై ఊరేగుతారు. 22న రాత్రి శ్రీవారి కల్యాణం అనంతరం వెండి గరుడ వాహ నంపై తిరువీధిసేవ ఉంటుంది.24న రాత్రి అశ్వవాహనంపైన గ్రామోత్సవం జరుగుతుందని ఈవో వివరించారు.





వాహనాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

డేంజర్@హైవే

హనుమాన్ జంక్షన్ టు గుండుగొలను

గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

రోడ్డుపై ఎత్తు పల్లాలతోనే పొంచి ఉన్న ప్రమాదం

15 రోజుల్లో పది మంది మృత్యువాత

ఏలూరు క్రైం, మే 16 : పదహారవ నెంబర్ జాతీయ రహదారిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలతో పలువురు మృత్యువాత పడుతున్నారు. హనుమాన్ జంక్షన్, గుండుగొలను జంక్షన్ మధ్యలోనే ఈ ప్రమాదాల సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. గతంలో కలపర్రు టోల్‌గేటు ప్రాంతం, అమ్మపాలెం క్రాస్ రోడ్డు, వంగూరు బ్రిడ్జి, రత్నాస్ హోటల్, ఆశ్రం ఆసుపత్రి, కొమిరేపల్లి అడ్డరోడ్డు, సత్యనారాయణపురం వంటి ప్రాంతాల్లో అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ఈ ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. 500 మీటర్ల నుంచే యాక్సిడెంట్ సూచిక బోర్డులను వంద మీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. అయితే రహదారి విస్తరణ తరువాత ఎక్కడా ఇలాంటి హెచ్చరికలు లేనే లేవు. బ్రిడ్జిలు కట్టిన వద్ద ఎత్తుపల్లాలు రావడంతో వాహనాలు అత్యధిక వేగంగా వెళ్ళి అకస్మాత్తుగా ఆ ఎత్తుపల్లాల వాహనాలు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌లను ఢీ కొట్టడమో, పల్టీలు కొట్టడమో జరుగుతున్నాయి. 15 రోజుల వ్యవధిలోనే ఈ ప్రాంతంలో పది మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

భయ పెడుతున్న ప్రమాదాలు

ఉంగుటూరు మండలానికి చెందిన ఒక కుటుంబం విజయవాడలోని కనకదుర్గమ్మవారి దర్శనానికి మోటారు సైకిల్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా కలపర్రు టోల్‌గేటు వద్ద ఎత్తుపల్లాలకు మోటారు సైకిల్ అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమారుడు, కుమార్తె మరణించగా తల్లి తీవ్ర గాయాలతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందింది. ఏలూరునకు చెందిన ఓ కుటుంబం మోటారు సైకిల్‌పై విజయవాడ కనకదుర్గమ్మగుడికి వెళ్ళి తిరిగి వస్తుండగా జంక్షన్ సమీపంలోని కొద్దిపాటి గతుకులు రావడంతో మోటారు సైకిల్ ఒకేసారి కుదుపు వచ్చింది. ట్యాంక్‌పై కూర్చున్న ఏడాదిన్నర కుమార్తె కింద పడి మృత్యువాత పడగా, తల్లి, దండ్రి, కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యారు. గురువారం అనకాపల్లి జిల్లాకు చెందిన పది మంది విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం చేసుకుని కారులో స్వగ్రామానికి వెళ్తుండగా ఆశ్రం ఆసుపత్రి వద్ద రోడ్డు కారు ఎగిరి కిందపడి టైరు పంక్చర్ అవడంతో అదుపుతప్పి కరెంటు స్థంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో పదిమంది తీవ్ర గాయాల పాలయ్యారు.


ప్రమాద ప్రాంతాలను గుర్తించాలి

జాతీయ రహదారిపై రేడియంతో కూడిన డివైడర్‌లు ఉండాల్సి ఉండగా కేవలం మామూలు నలుపు తెలుపు రంగులతోనే ఉన్నాయి. సర్వీసు రోడ్లల్లోనూ, జాతీయ రహదారిపైన అక్కడక్కడ కనిపించని ఎత్తుపల్లాలు ఉండడంతో అకస్మాత్తుగా వేగంగా వెళ్ళే వాహనం ఆ పల్లంలో చక్రంపడి పైకి ఎక్కే సమయంలో ఒకేసారి పైకిలేచి అదుపుతప్పి ప్రమాదాలకు గురవు తున్నాయి. హనుమాన్‌జంక్షన్ నుంచి గుండుగొలను జంక్షన్‌కు వెళ్ళే వరకూ ఇలాంటి ప్రమాదకర స్పాట్‌లు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా బ్రిడ్జిలు, చిన్నచిన్న కల్వర్టుల వద్ద స్పష్టంగా కనిపిస్తున్నాయి.కొన్ని ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోవడంతో ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఎక్కడెక్కడ బ్లాక్ స్పాట్స్ ఉన్నాయో వాటిని సరిదిద్ది ప్రమదాలు నివారిం చడానికి బ్రిడ్జిలను కూడా ఏర్పాటు చేశారు. ఇలాంటి బ్రిడ్జే ఆశ్రం ఆసుపత్రి వద్ద నిర్మించి ఎన్నో ప్రాణాలు కాపాడారు. అమ్మపాలెం క్రాస్ రోడ్డు వద్ద సర్వీసు రోడ్డులు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు పూర్తిగా నిర్మూలించ గలిగారు. ఉన్నతాధికారులు తక్షణం ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టాల్సి ఉంది. ఎక్కడెక్కడ హెచ్చరిక బోర్డులు అవసరమో, రేడియం పెయింట్స్ అవసరమో గుర్తించి చర్యలు తీసుకోవాలి.

రెండు మోటారు సైకిళ్లు ఢీ..ఇద్దరి మృతి



పడిపోయిన బైక్



ప్రమాదంలో మృతి చెందిన నాగూర్‌బీ

భీమడోలు,మే 16 :దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో తల్లి మరణించగా, కుమారుడు, కుమార్తె తీవ్ర గాయాలకు గుర య్యారు. ఇదేప్రమాదంలో రైల్వే ఉద్యోగి కూడా మృత్యువాత పడ్డారు. భీమడోలు మండలం సూరప్పగూడెం బ్రిడ్జి సమీపంలో గురువారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగిగింది. మంగళగిరికి చెందిన పఠాన్ నాగూర్‌బీ (48) ఆమె కుమారుడు తారక్‌బాబా (23), కుమార్తె నందిని (19)లు కలిసి ద్వారకా తిరుమల దైవదర్శనానికి వెళ్ళారు. తిరిగి సాయంత్రం మోటారు సైకిల్‌పై వస్తున్నారు. పలాసనకు చెందిన బద్రి లోకేష్ (28) భీమడోలు రైల్వే ట్రాక్ యూనిట్-5లో ట్రాక్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతను కూడా మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈరెండు మోటారు సైకిళ్ళు ఒకే దిశలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బద్రి లోకేష్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలకు గురైన నాగూర్‌బీ, తారక్ బాబా, నందినలను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర వైద్యులు పరీక్షించి అప్పటికే నాగూర్‌బీ మరణించిందని ధృవీకరించారు. తారక్ బాబా, నందినిలు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భీమడోలు పోలీసులు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేశారు. బద్రి లోకేష్, పఠాన్ నాగూర్‌బి మృత దేహాలకు పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

పెనుగొండ, మే 16: పెనుగొండ మండలం వడలి శివారు సిద్ధాంతం రోడ్డులో లారీ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందినట్టు ఎస్‌ఐ షేక్ సుభాని తెలి పారు. వీరవాసరం మండలం కొణితివాడకు చెందిన యరకరాజు, దుర్గా భవాని (39) గురువారం ఉదయం కొణితివాడ నుంచి సిద్ధాంతం రోడ్డు మీదుగా బైక్‌పై కోనసీమ జిల్లా పేరవరం వెళుతుండగా వడలి శివారులో ఎదురుగా వస్తున్న హెచ్‌పీ గ్యాస్ లారీ ఢీకొట్టడంతో దుర్గ భవాని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుమార్తె అయిన మధురిమకు బలమైన గాయం కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రదేశంలో మట్టి ట్రాక్టర్‌లు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డుమీద మట్టి పెరిగిపోయిందని దానికి తోడు వర్షం కారణంగా రోడ్డు తడిగా ఉండటంతో ఒక్క సారిగా అదుపు తప్పి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని పలువురు వాపోతున్నారు.

గోతిలో పడి బాలుడి మృతి

ఎస్‌ఐ ఇంట విషాదం



చింతలపూడి, మే 16: ఇంటివెనుక ఉన్న గోతిలో పడి నాలుగు సంవత్సరాల బాలుడు మృతిచెందిన సంఘటన ఎస్సై ఇంట విషాదం అలుముకుంది. చింతలపూడి మండలం నామవరం గ్రామానికి చెందిన గుగ్గులోతు చంటి అమలాపురంలో ఎస్‌ఐగా పనిచేస్తున్నాడు. సెలవులు కావడంతో తల్లి తన ఇద్దరి పిల్లలను తీసుకుని పుట్టింటికి నామవరం వచ్చింది. ఉదయం నుంచి ఆడుకుంటున్న బాలుడు మధ్యాహ్నం వేళ కనిపించకపోవడంతో కంగారు పడ్డారు. గంటసేపు వెతకినా కనిపించక పోవడంతో ఇంటివెనుక ఉన్న గోతిలో గాలించగా అందులో పడి మృతి చెందినట్లు తెలుసుకున్నారు. అంతకు ముందే బాలుడి అమ్మమ్మ ఇంట్లో చెత్తను గోతిలో పడేయటానికి వెళ్ళింది. బాలుడు కూడా వెనుకే వెళ్ళాడు. తిరిగి ఆమె ఇంట్లోకి వచ్చేసింది. బాలుడు వచ్చిన సంగతి గమనించక పోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. అయితే గోతిలో ఇటీవల పడిన వర్షానికి కొద్దిగా నీరు చేరడం వల్ల బాలుడు అందులో ఉన్నట్లు గమనించపోయారు. గోతిలో వెతికినప్పుడు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఎస్సై చంటి కూడా అదే గ్రామానికి చెందిన వ్యక్తి.. ఈ సంఘటన ఆ కుటుంబంతో పాటు గ్రామాన్ని విషాదంలో నింపింది.

క్రైం వార్తలు



డివైడర్‌ను ఢీకొట్టిన కారు

పది మందికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం,మే 16 : దైవ దర్శనానికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఏలూరు సమీపంలో టైర్ పంక్చర్ అయి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. అనకాపల్లి జిల్లా రాయకవచం మండలం దొండపూడి గ్రామానికి చెందిన గంజి చిరంజీవి, అతని భార్య వెంటకలక్ష్మి, వారి కుమార్తె భాగ్యలక్ష్మి, బంధువులు కొప్పాక ఆదిలక్ష్మి, చలపారెడ్డి వరలక్ష్మి, చెలపారెడ్డి రూప, నర్సీపట్టణానికి చెందిన చలపారెడ్డి శ్రీను, చలపారెడ్డి రావునాయుడు, శ్రీను కుమారుడు (4), చలపారెడ్డి గోపీలు కలిసి విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి దైవదర్శనానికి వెళ్లారు. గురువారం దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా అకస్మాత్తుగా కారు టైరు పేలడంతో అదుపుతప్పి సర్వీసు రోడ్డులోకి వెళ్ళి అక్కడ డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరంతా తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మెరుగైన చికిత్స కోసం విశాఖపట్టణం, నర్సీపట్టణాలకు బంధువులు తీసుకు వెళ్లారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు





ప్రమాద స్థలంలో..

రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 16 : ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్ జంక్షన్ వద్ద వేలేరు రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలపై ఒక వ్యక్తి మృత దేహం ఉన్నట్లు ఏలూరు రైల్వే ఎస్‌ఐ నరసింహారావుకు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో వెళ్ళి పరిశీలించారు. ఏలూరులోని వెంకటాపురం పంచాయతీ హనుమాన్ నగర్‌కు చెందిన పోలేటి రాధాకృష్ణ (46)గా గుర్తించారు. అతను రైలు పట్టాలు దాటుతూ మృతి చెందాడా, రైలు నుంచి జారిపడ్డాడా అనే విషయమై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.



పాలకొల్లు రైల్వే గేటు వద్ద స్పీడు బ్రేకర్లకు తోడు ఏర్పడిన పెద్ద గోతులు

ఎత్తిపడేస్తున్న స్పీడ్ బ్రేకర్లు

వాహనాలకు మరమ్మతులు.. ప్రయాణికులకు నడుం నొప్పులు

పాలకొల్లు అర్బన్, మే 16 : పట్టణంలో భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటు దాటాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డబుల్ ట్రాక్, ఎలక్ట్రిఫికేషన్ కార్యక్రమాలు పూర్తి కావడంతో గత ఏడాది నుంచి రైళ్ళు రాకపోకలు పెరగడమే కాకుండా వేగం కూడా పెరిగింది. అయితే భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటుకు (ఇరువైపులా) స్పీడు బ్రేకర్లు నిర్మించారు. దానికి 10 అడుగుల దూరంలో మరో స్పీడు బ్రేకర్ నిర్మించారు. స్పీడు బ్రేకర్లు దాటాలంటే చిన్న కార్ల కింది బాగం తగిలి చొట్టలు పడుతున్నాయి. ఇక బైక్‌లపై వెళ్ళేవారికి నడుములు పట్టి నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, మహిళ లు బైక్‌లను అదుపు చేసుకోలేక పడిపోయిన సంఘటనలు కూడా జరుగుతున్నాయి. స్పీడు బ్రేకర్లకు తోడు అదే ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు కూడా పడటంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో వెళ్ళే ప్రయాణికులు కూడా ఎగిరి పడుతున్నారు. ఇటీవల ఒక బస్సులో ఇద్దరు ప్రయాణికులు గాయపడినట్టు సమాచారం. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్ల ఎత్తు కొద్దిగా తగ్గించడంతో పాటుగా రోడ్డుపై గోతులను పూడ్చించాలని పట్టణ ప్రజలతో పాటు పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈరోడ్డు వెంబడి రోజు సుమారు 800 వాహనాలు, 3000 వరకూ బైక్‌లు నిత్యం తిరుగుతూంటాయి. అంతే కాకుండా రైల్వే ద్వారా ఎగుమతి అయ్యే బియ్యం లారీలు తరచుగా తిరుగుతూంటాయి. ఇక ఎఫ్‌సిఐకి వచ్చి, వెళ్ళే లారీలు కూడా ఉంటాయి. గేటు వద్ద రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, స్పీడు బ్రేకర్లను కూడా తీసివేయకున్నా ఎత్తు తగ్గించాలని వాహన దారులు, ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

నరసాపురం టౌన్, మే16: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం నుంచి వచ్చే నెల 7 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కుమారి తెలిపారు. నెల రోజుల పాటు కథలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం, ఆటలు, చదవడం, సృజనాత్మక, కంప్యూటర్, అవగాహన తరగతులు వంటివి విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందన్నారు. తొలి రోజున హెచ్ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ చినమిల్లి శ్రీనివాస్ విచ్చేసి పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

ఎన్డీఏ కూటమి విజయం తథ్యం

నరసాపురం టౌన్, మే 16: ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం తథ్యమని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేన్నేటి సురేష్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 125 నుంచి 135 సీట్లు ఖచ్చితంగా కూటమికి వస్తాయన్నారు. ఎస్సీ వర్గీకరణ, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు, పవన్‌లతోనే సాధ్యమని ప్రజలు విశ్వసించారన్నారు. అందుకే ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారన్నారు.

150 మట్టి నమూనాలు సేకరణ

నరసాపురం రూరల్, మే 16: మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల నుంచి సుమారు 150 మట్టి నమూనాలను సేకరించనున్నట్లు వ్యవసాయశాఖ ఏవో డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. సేకరించిన మట్టి నమూనాలను టీపీగూడెం పంపిస్తామన్నారు. వచ్చిన ఫలితాలు ఆధారంగా రైతులు వ్యవసాయం చేయాలన్నారు. ఎరువులు, పురుగుల మందుల వినియోగం, విత్తన శుద్ధి తదితర అంశాలకు అనుగుణంగా సాగు చేయాలని కోరారు.

రేపటి నుంచి సాయికోటి నామలిఖిత మహాయజ్ఞం

ఆకివీడు, మే 16: మాదివాడ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న సాయిదుర్గనగర్‌లోని షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 18 నుంచి 25 వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ రోజూ సాయికోటి నామలిఖిత మహాయజ్ఞం నిర్వహిస్తారన్నారు. ఈ నెల 24 ఐదు కోట్ల సాయినామాలు గల సాయికోటి పుస్తకాలతో బాబా ఊరేగింపు, అఖండ సాయినామ సంకీర్తన జరుగుతుందన్నారు. ఈ నెల 25న 100 అడుగుల ఎత్తు గల సాయికోటి మహాస్థూపంలో ఐదు కోట్ల సాయినామాలు గల పుస్తకాలు భక్తుల చేతుల మీదగా నిక్షిప్తం చేస్తారన్నారు. భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

రేపు వాసవిమాత జయంతి మహోత్సవాలు

ఆకివీడు, మే 16: ఆకివీడు వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవాలు ఈ నెల 18న జరుగుతాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గొంట్లా గణపతి తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకంతో పాటు ముత్తైదువులు, భక్తులు సమర్పి ంచే సారెతో గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అమ్మను దర్శించుకొని తీర్థ ప్ర సాదాలు స్వీకరించాలన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మెయిన్ సెంటర్‌లో దళాలతో గస్తీ తిరుగుతున్న ఎస్ఐ నాగబాబు

ఆకివీడు, మే 16: శాంతిభద్రతలకు ఎవరైన విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ బత్తిన నాగ బాబు హెచ్చరించారు. గురువారం స్థానిక మెయిన్ సెంటర్‌లో దళాలతో గస్తీ తిరుగుతూ మాట్లాడారు. పట్టణం, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా ఉండాలన్నారు.

రెండవ రోజుకు అతిరాత్ర మహాయాగం



యాగంలో వృద్ధ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, మే 16 : శ్రీ ఉమా రామలిం గేశ్వర ట్రస్ట్ (నెలమూరు) ఆధ్వర్య ంలో డీఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న రాజ శ్యామల దశ మహావిద్యా సహిత అతిరాత్ర మహాయాగం రెండో రోజుకుచేరింది. ఇందులో భాగంగా శతాధిక వృద్ధ దంపతులకు పూజలు లక్ష్మి గణపతి హోమం, దత్తాత్రేయ మేధ దక్షిణామూర్తి, హయగ్రీవ మూల మంత్ర జపహోమ కార్యక్రమాలు, దృష్టి నివారణ, గృహ బాధ నివారణ, యజ్ఞం నిర్వహించారు. డీఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అసోసియేషన్ కార్యదర్శి గాదిరాజు స త్యనారాయణరాజు (బాబు), తల్లిదండ్రులు రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ గాదిరాజు సోమరాజు కాంతమ్మ దంపతులకి దంపతీ పూజ నిర్వహించారు. యజ్ఞం కర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ, నరహరిశెట్టి కృష్ణ, కొత్తపల్లి శివరామరాజు, కోండ్రు శ్రీనివాసు పాల్గొన్నారు. ముందుగా మంగళ వాయిద్యాలు వేదమంత్రాలు నడుమ యాగశాల చుట్టూ 108 మంది దంపతులతో ప్రదక్షిణ నిర్వహించారు.

46 మందికి ఉచిత మధుమేహ పరీక్షలు

తణుకు, మే16 : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేసన్ సంఘ కార్యాలయంలో గురువారం మధుమేహ పరీక్షలు చేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి అధ్యక్షతన వైద్య పరీక్షలు నిర్వహించారు. సాయి శ్రీశ్వేత డయాగ్నస్టిక్ లాబ్ ద్వారా 46 మందికి పరీక్షలు చేసి, రిపోర్టులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





భీమవరం, పాలకొల్లులలో డెంగీవ్యాధిపై అవగాహన ర్యాలీలు

డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



ఆకివీడులో వైద్య సిబ్బంది ర్యాలీ

భీమవరం రూరల్, మే 16: ప్రమాద కరమైన జ్వరాలలో డెంగీ ఒకటని, దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రతీ ఏడాది మే 16వ తేదీన జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నారని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.ఉమామహేశ్వరరావు అన్నారు. వీర వాసరం మండలం కొణితివాడ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ నవనీత్ అధ్యక్షతన డెంగీ వ్యాధిపై అవగాహన శిబిరం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు డెంగీ వ్యాధి బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఈ అవగాహన శిబిరంలో డా.శిరీష, ఇతర పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: జాతీయ డెంగీ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఇడిస్ ఈజిప్ట్ అనే దోమ ద్వారా వ్యాధి ప్రబలుతుందన్నారు. ఈవ్యాధి వచ్చిన వారికి విపరీతమైన జ్వరము, తలనొప్పి, వాంతులు, వికారం, రక్త కణాలు తగ్గడం, దద్దుర్లు రావడం, కనుగుడ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇందుకు దోమలు పెరగకుండా చూసుకోవాలని, అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సూచించారు. సబ్ యూనిట్ అధికారికె రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు కార్యక్రమంలో విస్తరణాధికారులు గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, ఎస్‌కె అమలేశ్వరరావు, జి.ఉదయ చంద్ర, కె.బాలచంద్రుడు, డి.కమల, పీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే అరికట్టవచ్చని వెంకట్రామ న్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలో గురువారం మలేరియా నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సింధూ, ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ అ ధికారి డాక్టర్ ఆర్.రమేష్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పెదకాపవరంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. నిరుపయోగంగా ఉన్న టైర్లు, సిమెంట్ కుండీలు, కూలర్, కొబ్బరి చిప్పలు తదితర వాటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జుత్తిగ సత్యనారాయణ, పీహెచ్ఎన్, హెల్త్ సూపర్‌వైజర్స్ ఏఎన్ఎం, ఆశాలు తదితరులు ఉన్నారు.

గణపవరం: సమాజంలోని ప్రజలను పీడిస్తున్న డెంగీ మహమ్మారిని గ్రామస్థులంతా సమైఖ్యంగా రూపు మాపేందుకు శ్రమించాలని పిప్పర ప్రభుత్వ వైద్యాధికారి కే.ప్రియాంక కోరారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని గణప వరం మండలం పిప్పర, కాశిపాడు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహిం చారు. కాశిపాడులో జరిగిన అవగాహన ర్యాలీలో పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. డెంగీ వ్యాధిని అరి కట్టేందుకు ప్రతీ గృహంలో మహిళలు సైతం దోమలు నిల్వ లేకుండా శ్రద్ధ వహించినప్పుడే వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చన్నారు. తొలుత గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సుబ్బలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బొలిశెట్టిని కలిసిన పార్టీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, మే 16 : వైసీపీని తరిమి కొట్టడమే ధ్యేయంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలందరూ పనిచేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని తాడేపల్లిగూడెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పెంటపాడు, తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ నుంచి పలువురు నాయకులు బొలిశెట్టితో సమావేశమయ్యారు. అన్ని ప్రాంతాల్లోనూ కూటమి హవా చాటుకుందని కూటమి నాయకులు స్పష్టం చేశారు.

యలమంచిలిలో 85.59 శాతం పోలింగ్

యలమంచిలి, మే 16: పాలకొల్లు నియోజకవర్గంలోని యలమంచిలి మండలంలోని మొత్తం 57 పోలింగ్ కేంద్రాల్లో 57,010 మంది ఓటర్లు ఉండగా సార్వత్రిక ఎన్నికల్లో 48,799 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 85.59శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఇక గ్రామాల వారీగా ఓటింగ్ సరళి ఇలా ఉంది.

గ్రామం	బూత్ నెం	ఓటర్లు	పోలైనవి	శాతం
గుంపర్రు	29	896	783	87.38
గుంపర్రు	30	1033	869	84.12
కాంభోట్లపాలెం	31	1054	860	81.59
చింతదిబ్బ	32	653	584	89.43
కంచుస్తంభంపాలెం	33	619	535	86.42
కంచుస్తంభంపాలెం	34	683	591	86.53
బూరుగుపల్లి	35	920	786	85.43
బూరుగుపల్లి	36	872	729	86.60
కనకాయలంక	37	1145	942	82.19
కనకాయలంక	38	1003	816	81.35
దొడ్డిపట్ల	39	971	859	88.46
దొడ్డిపట్ల	40	953	776	81.42
దొడ్డిపట్ల	41	895	786	87.82
దొడ్డిపట్ల	42	972	846	87.03
అబ్బిరాజుపాలెం	43	1215	1096	90.20
అబ్బిరాజుపాలెం	44	980	897	91.53
పెదలంక	45	934	743	79.55
ఇలపకుర్రు	46	1055	856	81.13
ఇలపకుర్రు	47	787	652	82.84
నారినమెరక	48	985	841	85.38
వడ్డిలంక	49	778	704	90.48
కట్టుపాలెం	50	1442	1251	86.75
మట్లపాలెం	51	827	709	85.73
లక్ష్మీపాలెం	52	831	711	85.55
గంగడపాలెం	53	880	752	85.45
శిరగాలపల్లి	54	1004	893	88.94
శిరగాలపల్లి	55	819	718	87.66
పెనుమర్రు	56	1455	1229	84.46
నేరేడుమిల్లి	57	1043	863	82.74
మేడపాడు	58	1004	842	83.86
మేడపాడు	59	1228	1011	82.32
మేడపాడు	60	745	661	88.72
అడవిపాలెం	61	1106	959	86.70
అడవిపాలెం	62	717	636	88.70
అడవిపాలెం	63	693	621	89.61
కొంతేరు	64	1373	1119	81.50
కొంతేరు	65	1176	1009	85.79
కొంతేరు	66	1015	912	89.85
కాజ తూర్పు	172	1277	1100	86.13
కాజ పడమర	173	1427	1206	84.51
ఊటాడ	174	720	612	85.00
ఆర్యపేట	175	591	456	77.15
ఆర్యపేట	176	1218	955	78.40
యలమంచిలి	177	998	863	86.47
యలమంచిలి	178	944	846	89.61
యలమంచిలి	179	1068	917	85.86
యలమంచిలి	180	1181	1026	86.87
యలమంచిలిలంక	181	1058	925	87.42
చించినాడ	182	1050	879	83.71
చించినాడ	183	1171	929	79.33
చించినాడ	184	1002	825	82.33
కలగంపూడి	185	1052	968	92.01
ఏనుగువానిలంక	186	1236	1080	87.37
ఏనుగువానిలంక	187	1159	992	85.59
ఏనుగువానిలంక	188	1060	902	85.09
బాడవ	189	1039	971	93.45
బాడవ	190	997	900	90.27

పెంట్లమ్మ హుండీ ఆదాయం రూ.1,32,500



పెంటపాడు, మే 16 : కె.పెంటపాడు పెంట్లమ్మ ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు ఆదాయం రూ.1,32,500 వచ్చిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు పంతం శేఖర్ తెలిపారు. ఒక ఏడాది కాలానికి సంబంధించి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కించామన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, గ్రామ సర్పంచ్ పీతల సత్యనారాయణ, నరాలశెట్టి సంతోష్‌కుమార్, మల్లెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మే 16 : పార్టీలకు అతీతంగా కష్టాలలో ఉన్నవారికి జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పోలింగ్ సమయంలో జువ్వలపాలెంకు చెందిన వైసీపీ కార్యకర్త జయప్రకాష్ అక్కడ జరిగిన తోపులాటలో గాయపడ్డారు. ఈ ఘటనపై స్పందించిన బొలిశెట్టి శ్రీనివాస్ జనసైనకులతో సంప్రదించి బాధితుని కుటుంబసభ్యులకు రూ.10 వేలు గురువారం అందజేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో భవన్స్ విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్, మే 16: తాడేపల్లిగూడెం భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు ఇటీవల విడుదల చేసిన సీబీఎస్ఈ పదో తరగతి, 12వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పదోతరగతి ఫలితాల్లో పి.విద్య 486 మార్కులతో 97.2 శాతం మార్కులు సాధించిందని, 12వ తరగతి ఫలితాల్లో పి.విక్రమాదిత్య 482 మార్కులతో 96.4శాతం సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భవన్స్ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ప్రిన్సిపాల్ రాజీవ్ కుమార్ శర్మ అభినందించారు.

రాబోయేది ప్రజా ప్రభుత్వమే : పద్మ

తాడేపల్లిగూడెం రూరల్, మే 16: సామాన్యురాలైన తనను స్వతంత్ర అభ్యర్థిగా తనకు మనోధైర్యం కల్పించి ముందుకు నడిపిన నియోజకవర్గ ఓటర్లకు స్వతంత్ర అభ్యర్థి ఉంగరాల పద్మ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక జీకే ఆనంద్ కార్యాలయం వద్ద గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం అందించిన స్ఫూర్తితో తాను అవినీతి నాయకుడిని ఎదిరించేందుకే పోటీలో నిలిచానని తనకు అంతా అండగా నిలిచారన్నారు. రాబోయేది ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమనే నమ్మకం ఉందని దీనికి నిదర్శనం ఓటర్ల చైతన్యమేనన్నారు. నాయకులు గురజాడ ఆనంద్ పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బసవా రామకృష్ణ

తణుకు, మే 16 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని నరసాపురం పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షుడు బసవా రామకృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక, అవినీతి, అక్రమ కేసులు, అరెస్టులతో ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఓటు వినియోగం కోసం దేశ విదేశాల నుంచి ఎంతోమంది విచ్చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వంతోనే సాధ్యమని అన్ని వర్గాల ప్రజలు నమ్మి ఓట్లు వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండి రామకృష్ణ, గోపిరెడ్డి చిన్నారావు, కాకిలేటి హ రినాథ్, కొమ్మిరెడ్డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సాయం



పాలకొల్లు రూరల్, మే 16 : పోడూరు మండలం జిన్నూరుకు చెందిన వి.ప్రసాద్ అనే వ్యక్తి హెర్నియా ఆపరేషన్ చేయించుకుని అస్వస్థతకు గురి అయిన సంగతి తెలిసి ప్రసాద్‌కు రూ 10వేలు నగదు, బియ్యం, నిత్యావసర సరకులను మానవత సంస్థ కార్యాలయంలో అందజేశారు. సంస్థ సభ్యులు సహకారంతో ఈకార్యక్రమం చేపట్టినట్లు సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ ముత్యాల రామారావు, కోశాధికారి మద్దాల వాసు, సభ్యులు బొక్కా గంగాధర్, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, పెన్మెత్స నాని పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు అర్బన్, మే 16:విద్యుత్ లైన్ల మరమ్మతులు,చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఈనెల 17వ తేదీ ఉదయం 8గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శంభునిపేట, బంగారు వారి చెరువు గట్లు, బ్రాడీపేట, పెద్ద పోస్టాఫీసు, వెంకటేశ్వర కాలనీ, బ్యాంక్ వీధి, మెయిన్ రోడ్డులోనూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

తణుకు: పట్టణంలో విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ డివిజినల్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలు, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెంటపాడు: విద్యుత్ మరమ్మతులలో భాగంగా శుక్రవారం మండలంలోని పెంటపాడు, ముదునూరు, ఆకుతీగపాడు, కె.పెంటపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి, పడమరవిప్పర్రు గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ డీఈ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేస్తామని ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మందాలమ్మ ఆలయానికి విరాళం



పెనుగొండ, మే 16: పెనుగొండ మండలం వడలి గ్రామదేవత మందాలమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా దాతలు ఆకాశపు సాయి కృష్ణ, వీవీ సత్యవతి, కాపిశెట్టి ధన ప్రసాద్‌లు ఆలయ కమిటీ సభ్యులకు రూ.25,116 విరాళం అందజేశారు.

పవన్ గెలవాలని పూజలు



భీమవరం టౌన్,మే16 : సార్వత్రిక ఎన్నికలల్లో పిఠాపురంలో పోటీ చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ ఆపార్టీప్రోటోకాల్ ఛైర్మన్ మల్లినీడి తిరుమల రావు(బాబి) అంతర్వేదిలోని లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలుచేయించారు. ఆయనతో పాటు చల్లారాము తదితరులు ఉన్నారు.

లెక్కలు వేసుకుంటున్న నేతలు

ఆచంట, మే 16: ఎప్పుడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికలు ఈసారి ఇరు పార్టీలు మధ్య హోరా హోరీగా జరగడంతో పోలింగ్ అనంతరం ఏఏ గ్రామాల్లో ఓటర్లు ఏ వైపు ఉన్నారు.. ఏ పోలింగ్ బూత్‌లలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో అనే లెక్కలలో నేతలు నిమగ్నమై ఉన్నారు. ఆచంటలో టీడీపీ కూటమి, వైసీపీ మధ్య ఎన్నికలు హోరా హోరీగా జరిగాయి. దీంతో ఇరు పార్టీల నేతలు గ్రామాలు వారిగా లెక్కలు వేసుకొని తమ అభ్యర్థే వేల సంఖ్యలో మెజార్టీతో విజయం సాధస్తారంటూ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే పందెం రాయుళ్ళు కూడా పందాలుకు సై అంటున్నారు. రానున్న రెండు రోజుల్లో ఆచంట సీటుపై జోరుగా పందాలు జరిగే అవకాశం కనిపిస్తుంది.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆచంట, మే 16: ప్రభుత్వ ఐటీఐ ఆచంటలో 2024-25 సంవత్సరం మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరవలసిన విద్యార్థులు ధృవపత్రాల నకళ్ళను స్వయంగా కళాశాలకు జూన్ నెల 10 లోపు అందజేయాలన్నారు. కౌన్సెలింగ్ వివరాలు మరలా తెలియజేయడం జరుగుతుందని మరిన్ని వివరాలకు సెల్ నెం. 9490111002కు సంప్రదించాలని కోరారు.

నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు

పెనుగొండ, మే 16: పెనుగొండలో నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీ మహిషాసుర మర్ధిని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు గురువారం కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ వాసవి యువజన సంఘం వారిచే భక్తులకు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. శ్రీవాసవి గీతా మహిళా సమాజం వారిచే వాసవి పురాణం నిర్వహించారు.

పశువులకు గొంతు వాపు నివారణ టీకాలు



భీమవరం టౌన్, మే 16 : పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జావర్ హుస్సేన్ పర్యవేక్షణలో స్థానిక ఏరియా వెటర్నరీ ఆసుపత్రి పశు సంవర్ధక శాఖ సిబ్బంది వీధి పశువులకు గొంతు వాపు వ్యాధి (గురక వ్యాధి) నివారణ టీకాలు వేశారు. భీమవరం మున్సిపల్ పరిధిలోని వీధి పశువులు 290ఉన్నాయని, వీటికి వారం రోజులపాటు ఉచిత టీకాల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని హుస్సేన్ తెలిపారు. పశువులకు సంబంధించిన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పశువు లకు టీకాలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో జీవ కారుణ్య సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుంకర దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు అడుగుల పాము హతం



మొగల్తూరు, మే 16: మొగల్తూరు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని ఒకరి నివాసంలో గల బాత్ రూమ్‌లో గురువారం ఆరు అడుగుల తాచు పాము కంట పడింది. ఇది చూసి కంగారు పడిన ఇంటి యజమాని తన వద్ద పనిచేసే సహాయకులకు చెప్పడంతో ఆపామును చంపి దహనం చేశారు.

ప్రభుత్వ పథకాల సొమ్ములు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

భీమవరం అర్బన్, మే 16: ప్రభుత్వం రైతులకు విడుదల చేయాల్సిన సబ్సిడీలు, అమ్మఒడి, ఈబీసీ నేస్తం ఇతర పథకాల డబ్బులు లబ్ధిదారుల ఖతాల్లోకి జమకాలేదని తక్షణమే జమచేయలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాం డ్ చేశారు. సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సమావేశం సుందరయ్య భవనంలో చింతకాయల బాబురావు అధ్యక్షతన గురువారం జరిగింది. అధికారులు రైతులకు సంచుల కొరత సమస్య లేకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి డబ్బుల్ని చెల్లించాలన్నారు. తేమ పేరుతో ధరలో కొరత పెడితే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయ్యాయి ఓటర్లను డబ్బు, మద్యంతో ప్రలోభాలకు గురిచేశారన్నారు. వీటిని అరికట్టడంలో ఎన్నికల కమీషన్ విఫలమైందన్నారు.